

## కాశీపట్నం చూడరబాబూ

శతకోటి దరిద్రాలకి అనంతకోటి వుపాయాలని ఒక హ్యూమరస్ సామెత వున్నది. భజగోవిందం అనేది హ్యూమరస్‌వేలో వాడతారు. ఆ శ్లోకాలు వ్యాప్తి చెంది పండిత పామరుల నొక్కసారే రంజింప చేశాయి. అట్టి కవిత అల్లగలిగిన వ్యక్తి మహాకవి. ఆ స్టాంజాలలోని ఒక లైను '' ఉదర నిమిత్తం బహుకృత వేషం''. దీనిలో దాగిన పాయింటే సామెత అయింది. సదానంద నొప్పింపక తానొవ్వక ధన్యుడు కావాలనుకుంటే కథ అడ్డం తిరిగేది. కలిసొచ్చేది కాదు. హరిశ్చంద్రుడు రాజ్యం కోల్పోయాక, 'పోతేపోయిందిలే పీడ' అనుకుని జీవిక కోసం యేది చేయబోయినా కలిసిరాక పోతే చివరికి భార్యనమ్మి తానూ అమ్ముడుపోయాడు. భార్యనమ్మినప్పుడు ''అప్పు తీరిపోయింది'' అని భ్రమపడ్డాడు. కాని నక్షత్రకుడు ''నువ్విచ్చింది నా దారిబత్తెం. గురువుగారికి యజ్ఞానికి యిస్తానని మాటిచ్చిన రొక్కం యివ్వాలి. ఇస్తానన్నావు'' అని సతాయించాడు. '' ఇదేదో పరీక్షలాగా వున్నదే. నెగ్గాలి'' అనుకుని పనిచేసి చెల్లిస్తా'' అన్నాడు హరిశ్చంద్రుడు ''యేమి చేయగలనంటావు?'' వణిజ వర్తనముచే గణియింతునంటివా, ఉడుగ వురాచపోకడలు నీకు' అని ఆశువుగా సీసపద్యం అల్లాడు నక్షత్రకుడు ''తోక పీకుతూ నీ వెంట యింకెన్నాళ్లు రాను?'' అని యేడుస్తూ ''యివాళే తీర్చేయి. లేదా యజ్ఞానికి డబ్బిస్తాననలేదు అను. పోతా'' అని వత్తిడి తెచ్చాడు. ''నీకేమో మాట నిలకడ మానియా, నా గురువుకేమో ఇగో. అయినా పూర్వాశ్రమంలో రాజే. నా పని అడకత్తెరలో వక్కలాగా అయింది''.

'' ఇవాళే చెల్లిస్తా. మాటిస్తున్నా. నన్ను అమ్మండి. మీరే పిలిచి నా విలువ చెప్పండి. నా గుణగణాలు నేను చెపితే బావుండదు''. నక్షత్రకుడు మనసులో తనను తాను తిట్టుకుంటూ, యేడుపు దిగమింగి, గుండెరాయి చేసుకుని, గొంతెత్తి ''అవధారుడయ్యయో అగ్రజులార

ద్రవిణేశుమించు ఉత్తమ వైశ్యులార'' అని ఆశువుగా సీసపద్యం అల్లాడు. జనులు

పోగై నిలబడి విన్నారు. వెల విని కొనటానికి ముందుకు రాలేదు. పొద్దెక్కుతున్నది.

కాటి కాపరి అయిన చండాలుడు వస్తూ కనిపించాడు. అజానుబాహు, నలుపు, సంస్కారం లేని జుట్టు. దానికి గుడ్డ కట్టాడు. గడ్డం మీసం. పెద్ద కళ్లు బుజం మీద గొంగళీ దాని మీద పెద్దకుండ మెళ్లో కంటె. కుడిచేతికి కడియం. మోకాళ్లవరకు ముతక బట్ట. కుడికాలికి కడియం. కిర్రుచెప్పులు, ధీర గమనంతో రాజబాట వెంట వస్తుంటే రెండు వేపులా కుక్కలరుస్తూ కూడా వస్తున్నాయి. కాటి కాపరి పట్నంలోకి రాజవీధి వెంటరాడు. రాగూడదు. అందుకనరుస్తున్నాయి.

''తొలగిపోనిండయ్యా। దొరలు పెద్దింటోణ్ణి।

పవలు మీ కుక్కల । కట్టి వేస్కొండయ్య

గబగబ బౌవ్వంచు కరవ వస్తుండాయి''

జనులు తొలిగారు. నక్షత్రకుడు వానిని చూస్తూనే కుడిచేతి వేళ్లతో ముక్కు మూసుకున్నాడు. కల్లు వాసన.

కాటి కాపరి నిలబడి వెల అడిగి, బానిసగా అమ్ముడు పోబోతున్న వాని గుణగణాలడిగాడు.

''చూస్తున్నావుగా నీ కళ్లతోనే. దుక్కలాగా వున్నాడు. మాట నిలుపుకునే వానియూ. అదే యీ యిక్కట్టు తెచ్చింది. ఇది చేయుము అనడు. హరాయించుకునే శక్తిగలవాడు''

''వెల సెప్పవా?''

''దంతావళము పయిన్ బలవంతుండొక్కండు నిలిచి

రతనం బెంతటి దవ్వుగ రువ్వునో అంతటి అర్థంబు''

''అంత విలువ గలవాడెందుకు తనను తాను అమ్ముకుంటున్నాడు?'' నక్షత్రకుడు టూకీగా కారణం చెప్పాడు. విన్న కాపరి,

''మతిమరుపేమో. దద్దమ్మేమో'' అన్నాడు.

''కాదు. మాటనిలకడ విలువ తెలిసినవాడు. చూస్తే కొనలేవేమో పో'' అని వుడికించాడు నక్షత్రకుడు.

భృకుటి ముడివేసి చూసి కళ్లు పెద్దవి చేసి నిదానంగా చూసి, కాపరి యడం చేతో కుడిమీసం మెలేసి, ''నేటినుండి నీవు నా బానిసవు. నీ పేరు వీరబాహు. రా. యీ కుండ బుజాన పెట్టుకో. నీవు నాతో వస్తావా బాపనయ్యా? రొక్కం పంపేదా'' అనడిగాడు కాటి కాపరి.

''రాను'' అని చేయి తిప్పాడు నక్షత్రకుడు.

2

సదానంద, శాంతి సౌఖ్యాలిచ్చే టెంపొరరీ జాబ్స్ చేస్తూ, పెద్ద జీతం యిచ్చినా అశాంతినీ అవమానాన్నీ అందించే జాబ్స్‌ని తృణప్రాయంగా వదిలేస్తూ కాలం గడిపాడు. పెళ్లి నానుస్తూ వచ్చేప్పటికి నలభై దాటి చెంపలు నెరిసినై. '' ఇంకేం పెళ్లీ వెండిమూతి గూడా వచ్చేస్తున్నది'' అని నవ్వుకున్నాడు. ఒక ఆఫీసు ఫ్యూన్‌కి సదానంద వద్ద చనవేర్పడి ఆ టాపిక్ మీద డైలాగ్సు నడిచాయి.

''యెందుకని తిప్పేశారు సార్ సంబంధాలూ? అవీ జాబ్స్‌లాగే కనిపించాయా, లేడీ లవర్ హార్ట్ బ్రేక్ చేసిందా తల అడ్డంగా తిప్పిందా సార్? నమ్మబలకక పోయారూ? అరేంజ్‌డ్‌వీ పాడైనాయా?''

విచారమూ నవ్వు కలిపి చూశాడు సదానంద.

''అరేంజ్‌డ్ మారేజ్ అరేంజ్ చేసిన వారికే నచ్చలేదు. చివర్లో ఒప్పందాలు మారాయి. బెడిసింది యవ్వారం ప్రేమ వెలిగిద్దామనుకున్నా. కాని మారేజ్ కాకముందే కాకి రెక్కలొచ్చి యెగిరిపోయింది బలరాం. కొంత కోర్టింగ్ జరుగుతుండగానే ఆమె ఆత్మీయులు కోర్టుకీడ్చారు నన్ను. అంటే యాగీ గలాటా దొమ్మీ అన్నమాట''.

''అయ్యో! అదేం మనుషులో!'' అన్నాడు బలరాం. ''గెలిచారా సార్!''

అన్నాడు. ''లేదుమా వాళ్లూ కర్రసాము చూపారు'' ''మరో ప్రేమ కలాపం సవాల్ జవాబ్‌తోనే మంగళం పాడింది''.

''అంటే సరిగా అర్థం గాలేదు సార్!'' అనడిగాడు బలరాం.

''మీ వాళ్లను డిజోన్ చేస్తారా?'' చేయను హృదయేశ్వరీ? 'నేను వర్కింగ్ వుమన్ని జాబ్‌కి తిలోదకాలివ్వాలా?''

''అక్కర్లేదు ప్రాణేశ్వరీ. నిరాక్షేపణీయంగా చేసుకోవచ్చు''.

''పొసెసివ్వా మీరు? హెవీ జలస్సా? సస్పిషస్సా?''

''అటువంటి సద్గుణాలు లేవు నాకు ప్రియా. యూ ఆర్ ఫ్రీ టుడు ఎనీ థింగ్ యు లైక్'' అని పెళ్లిదాకా నన్నా యీ భామా కాలపం చూద్దామనుకుంటే, మొహం తప్పించేసింది భామ. మరోడాకర్షించాడేమో బలరాం''.

బలరాం పకాపకా నవ్వి ''బలేవారు సార్!'' అని నవ్వి ''మీ అభిప్రాయం చెప్పండి సార్. తెలుసుకుంటా'' అన్నాడు.

''పెళ్లిని గురించా బలరాం? నా అభిప్రాయం కన్న మహామహుల అభిప్రాయాలు విను. తాత్కాలికోద్రేకాన్ని పర్మినెంట్ చేయలనుకోటం తెలివిలేమి అన్నాడు గొప్ప శాస్త్రవేత్త. అంటే పెళ్లి ప్రేమా అనేవి పర్మినెంట్ కావు అని మరో గ్రేట్ రచయిత పెళ్లిని గురించి హాస్యాలాడుతుంటే, ''మరి నువ్వెందుకు పెళ్లాడావూ?'' అని నిగ్గదీసిందో యిల్లాలు.

'' ఔటాఫ్ ఇగ్నోరెన్స్'' అన్నాడా రచయిత.

''మరి వుద్యోగాల్లూ అలాగేనా సార్? భుక్తి గడవాలిగా? ముష్టెత్తరు మీరు. వీర ముష్టి అసలే యెత్తరు మీరు సార్!''

''యెట్లాగో నా పేరు సదానంద అంటున్నారు గనక ''అనటమేమిటి సార్! అసలు పేరు కాదా సార్?''

''కాదు. బ్రహ్మానందం. గాయత్రి వుపదేశించిన పురోహితుడు సదానంద అని మార్చాడు. బాల్యం వదల్లేదప్పటికి. ఆ పేరుతో ఒక చిన్న ఆశ్రమం లేవదీసి ఒక

మిషన్ నడపాలని ఆలోచిస్తున్నాను బలరాం. బుర్రలోకి ఐడియా ప్రవేశించిందివాళే''.

''మిషన్ నడపటానికీ పెట్టుబడి కావద్దా సార్? మీరు సమర్థులే కావచ్చు. కనీసం పదిహేను వేలన్నా వుండాలి మిషన్‌కి?''

''అంతక్కర్లేదు. నేను సేల్ చేసుకున్నది చాలు. నా చిన్నప్పుడు నేను మా అమ్మతో చెల్లితో కలిసి నైజాం వెళ్లాను. తండ్రిపోయి నిరాధారమైనాము. యాడాదే అయింది. గురువు వేషం వేసి ఆర్జించవచ్చు అని మరో గురమ్మ ఆశ రేపితే మా అమ్మ నమ్మింది. ఖర్చులు గురమ్మవే. తన శిష్యురాలు కాశీ వెళ్తే ఆ చిన్న క్వార్టర్సులో దిగింది. భక్తుల నాకర్షించటానికి వారిద్దరూ పట్నంలోకెళ్తే చెల్లీ నేనూ మిగిలాము. చెల్లికి యేణ్ణార్థమే. నడకా మాటలూ వచ్చాయి. నా చేయి పట్టుకు వచ్చింది. సత్రం గది వదిలి వీధిలోకొచ్చి మెట్ల చివర నిలబడి చూస్తే పిల్లలు గుంపుగా జేరి దేనిలోంచో చూస్తూ వినోదిస్తూ ఆనందిస్తున్నారు. వారి దగ్గరకెళ్లాము.

ఒక స్త్రీ దేశవాళీ యంత్రంలోంచి సినిమా లాటిది చూపుతూ, కానీ, దుగ్గానీ, అర్ధణా రాగి నాణేలు పిల్లలు చెల్లించే వాటితో సంచీ నింపుతున్నది. నేడు వీడియో పార్లర్ అంటున్నారు. మునుపు వీధి నాటకం అనేవారు. అలాగే వీధి వినోదం చౌకలో చూస్తున్నారు పిల్లలు. మమ్మల్నీ ప్రోత్సహించింది స్త్రీ ''చూడండి బాబూ దుగ్గానే'' అని నాణెం చూపింది. ఆనాటి నైజాం నాణెం. ఇంకా వాడుకలో వున్నదేమో.

''దేశవాళీ మెషీనంటే?'' అనడిగాడు బలరాం.

''సింపుల్. మూడు కాళ్ల స్టాండు దాని మీద సైజు కెమెరాలాంటి యంత్రం ముందుకి గొట్టం. నల్లని దుప్పటితో మొత్తం యంత్రాన్ని కప్పి వుంటుంది. గొట్టం మూత తీసి చూస్తారు. పిల్లలు ఒక్కొక్కరే. దుప్పటి వారి తల మీదుగా కప్పుతుంది. స్క్రీన్ మీద బొమ్మలు కదిలిపోతూ వినోదమిస్తాయి. రంగులవే.

ఆ స్త్రీ ఒక కంజీరా వాయిస్తూ పాడుతుంది. తలకు రుమాలు. అంచుల

వెంబడి కాసులంటి బిళ్లలు. పెద్ద స్కర్టు, షర్టు, కాసిని నగలు, వుంగరం. గాజు ఒకటి చేతికి, కాళ్లకు గల్లుమనే కడియాలు బోలువి. కాలివేళ్లకు మట్టెలు పిల్లాళ్లు. ముక్కర, బొట్టు, తాంబూలం నమిలిన నోరు.

''కాశీపట్నం చూడరబాబూ, గంగానదినీ చూడరబాబూ. తిరుపతి దేవుని చూడర బాబూ, వడ్డీ కాసులవాడని పేరూ జాతినేతలను చూడరబాబూ. దేశభక్తులా చూడర బాబూ। దేశ ద్రోహుల చూడరబాబూ। నీతిమంతులా చూడరబాబూ। అవినీతి పరులనూ చూడరబాబూ''.

''అంతా ఒకటే అనరా బాబూ। పుణ్యస్థలముల చూడర బాబూ పుణ్యమూర్తులా చూడరబాబూ. పాపపంకమున పడకుర బాబూ। అడుసులో పిల్లివి అవుదువు బాబూ, చెల బిల చెల బిల। చెల బిల చెల బిల'' అని రెండు కంచుబిళ్లలు కొడుతూ వాయిస్తూ లయచూపుతుంటే లోపల చిత్రాలు పాటకనుగుణంగా కదిలిపోతాయి. కాసేపే'' అప్పుడవెలా కదిలి పోతున్నాయో వూహించలేని వయసు. వినోదమే ముఖ్యం వ్యూమాస్టర్ చూశావుగా? గాజు ముక్కానీ వినోదమిస్తుంది''.

'' అ రెండూ చూశాను సార్'' అన్నాడు బలరాం.

''టెక్నాలజీ విజృంభించి ఇంటర్నెట్ యెలా రన్నవుతుందో చెప్పలేము. గతం, తెలియనివీ, నీక్కావాల్సినవీ చెపుతుంది.

అ పద్ధతిలో సంపాయించాలని ఆశ బలరాం''.

''బావుంది సార్ ఐడియా. మీ ఆశ్రమం రన్ చేయటంలో నేనూ పనికొస్తానేమో సార్! ఇదుగో నా ఫోన్ నెంబరు''. జేబులోంచి చిన్న నోట్‌బుక్, పెన్ తీసి నంబరు వ్రాసి సదానంద కందించి వెళ్లాడు బలరాం.

3

దేవుని మీద భారం వేసి చిన్న మెడికల్ హాల్ స్టార్టు చేసినట్టు చిన్న ఆశ్రమం స్థాపించి నడుపసాగాడు ఆనంద. అదీ భుక్తి కోసమే పేరు ప్రఖ్యాతుల కోసం

గాదు. సాహసే లక్ష్మి అని సామెత. దైవమనుకూలించినా హర్డిల్స్, ట్రబుల్స్ వస్తూనే వున్నాయి. ఒక హర్డిల్ పేరు అంతరాత్మ. దాని నోరు నొక్కాలనీ నేను నీకు వెరవను అందామని ట్రై చేశాడు సదానంద. కాని అది చారల పులిలాగా గాండ్రుగాండ్రుమన్నది.

దాని చారలు, కోరలూ, గోళ్లూ, పంజా చూసి దడపుట్టి ''అలాగే। అలాగే'' అని శాంతింపజేసి అప్పటికి వదిలించుకున్నాడు ఆనంద.

దైవానుగ్రహం వల్ల ఆశ్రమం రోడ్డెక్కిన కారులాగా నడిచి, మూడుపువ్వులారుకాయలులాగా కనబడి పామరులనాకర్షించింది. నిరుద్యోగ యువకులు, రిటైరైన వుద్యోగులు సంసారం రోసిన వారూ, సంసారే కింకాసారం అని తలచిన వారూ ఆశ్రమంలో చేరి, సందానందకు శ్రమ తగ్గించి ఆశ్రమాన్ని లీప్స్ అండ్ బౌండ్స్ స్టైల్లో పైకి తెచ్చారు.వారి వంతు ఆస్తీ, సొమ్మూ, పింఛనీ వాడుతూ సదా ఆనందం కలిగేట్టు డిస్కోర్సులూ, మత చర్చలు, ఆధ్యాత్మిక గెట్టుగెదరూ, ఏకాహ, సప్తాహాలూ, చేయసాగారు. ఆశ్రమ అంతే వాసులలో, వైద్యులు, శస్త్రవైద్యులూ, మూలికా వైద్యం, చిట్కా వైద్యం, అరఖు వైద్యం హోమియో తెలిసినవారే కాక, పాక కళ, సంగీత, నాట్యం, లెక్కాడొక్కా చూడగలవారు పూలవనం వేయగలిగినవారు. కూరలు పండించగలవారు, చివరికి పత్రిక నడపగలవారూ వున్నారు.

నిర్మోహిలాగా కనబడుతూ శూన్యంలోకి చూస్తూ సదానంద ఆ శూన్యంలో ఆకారశూన్యుని చూడగలుగుతున్నాడు. అంతరాత్మ పులి రూపంలో వచ్చి, సదానంద కెదురుగా వెనక్కాళ్ల మీద కూచుని, ముందు కాళ్లు నేల కానించి, రాచిప్పలాంటి నోరు తెరచి యెర్రని నాలుక తెల్లని కోరలు చూపుతూ ఆవలించి, మీసాలాడించి నవ్వు మొహం పెట్టించె. కళ్లు మరకత మాణిక్యపుష్యరాగాలల్లే మెరిశాయి.

''సతాయించటానికి వచ్చావా? నా మానాన నన్ను వదిలేయి''

''చాలా పోగుచేస్తున్నావే! చాలా మంది భక్తులూ, అనుయాయులూ

పోగైనారే నీమట్టూ, చారిస్మా పెరిగింది నీకు. వేషధారణ ఇంప్రూవైంది. ఆశ్రమమా అంచెలభవనమా రెస్టారెంటా? భక్తులా కస్టమర్సా! భేషజం, దాంభీకం కాషాయ వస్త్రాలు, రుద్రాక్ష తావళాలూ'' అని నవ్వితే దొంగనవ్వు లాగా వున్నది.

''అవన్నీ నే చేయలేదు. దేనిలోనూ పనికిరాని వారిక్కడ చేరి అవన్నీ చేశారు. వారి జీవిక వారే కల్పించుకున్నారు. నన్నాధారం చేసుకుని కాలం గడిపేస్తున్నారు''.

'' ఒప్పుకుంటా. కాని నీవు రన్ చేసే కాశీపట్నం చూడర బాబూ గంగానదినీ చూడరబాబూ అనే పేరుగల ఇంటర్నెట్ వంచన గాదూ?'' అని గాండ్రుమన్నది అంతరాత్మ.

''అది ప్యూర్ వినోదం. మనిషికి వినోదమూ కావాలి. అనాది నుంచీ వినోదమున్నది. జలచర, భూచర, పశుపక్ష్యాదులనూ మృగాలనూ చూసి వినోదించేవారు మానవులు. క్రమంగా అనుకరించటం నేర్చారు. గానం మొదలైంది. కోకిల పంచమం, ఋషభంలాగా రిషభం, సింహగర్జన, కేకిక్రేంకారం, గజతానం కనిబెట్టి తామానందిస్తూ తోటి మానవులకు వినోదమిచ్చారు. నువ్వు తప్పు పట్టాలని వస్తావు. తప్పు పడతావు. పో. రావోకు'' అన్నాడు విసుగ్గా. ''పోతా గానీ, వస్తూ వుంటా. చెక్ చేయాలి. అదినా పని'' అని వెనుక తోక చూపుతూ ధీర గమనంతో హుందాగా అడుగులేస్తూ వెళ్లింది పులి అనే అంతరాత్మ.

''పొంచివుంటుందేమో. పొంచాలమారేమో'' అనుకున్నాడానంద. గేటు చప్పుడైతే అటు చూశాడు. వరండాలో చాప మీదున్నాడు ఆనంద.

ఒక వృద్ధుడు, ఒక యువ్వనిని వెంటబెట్టుకొచ్చి నిలబడి దణ్ణం పెట్టాడు.

''అలా కూచోండి. పెద్దలు! నాకు దణ్ణమెందుకు? నేను సామాన్యుడిని''.

వాళ్లిద్దరు చెప్పులు వదిలి అరుగు చివరగా చాపమీద కూచున్నారు. దానిమ్మ, బొప్పాయి, కమలా, ఏపిల్, రేగుపళ్లున్న పళ్ళ సంచీ ఆనందకు దగ్గరగా వుంచాడు వృద్ధుడు.

''నేనేమి చేయగలను?''

''లాఫ్టరీజ్ ది బెస్ట్ మెడిసిన్ అన్నారు. మీరా థెరఫీ ద్వారా అనారోగ్యం పారద్రోలి ఆరోగ్యం ప్రసాదిస్తున్నారని విన్నాను''.

''యెవరికి అనారోగ్యం?''

''చూశారుగా గురూ? ఇది నా కూతురు నవ్వదు. మొద్దు నక్క మొహం. రంగూ రుచీ వాసనలేని వంటనూనెలాగా వుంటుంది నడవడి''. ''వంట నూనెతో పోల్చారు. వంటకు పనికొస్తుందేమో?'' అన్నాడు ఆనంద.

'' ఈ కూతురదీ చేయదు. వంట యింటివేపే రాదు. రాజాలాగా కూచుని, గుల్లిం గుడ్డిదైనా దాణాకు తక్కువ లేదన్నట్టు, విస్తరెడు భోజనం ఆరగిస్తుంది. మంచి తిండి పుష్టి వున్నది. బాసింపేట వేసుక్కూచుంటుంది.మాటకు వంక పెట్టదే. హరాయించుకుంటుంది. విస్తరెత్తదు. దీన్ని నవ్విస్తే నాలుగు వేలిప్పుడే యిస్తాను ఆశ్రమానికి. డ్రాఫ్టు రూపంగానైనా సరే, హార్డ్ కాష్ యివ్వాలన్నా యిబ్బంది లేదు గురూ''.

'' ఇతర థెరపీలు'' అంటున్నాడానంద.

''అవి పనిచేయలే, ఇదిట్లా గుడ్లు పెట్టుకుని చూస్తుంటేనే తెచ్చాను గురూ. అయితే ఎల్లర్జీ, కాకపోతే ఇన్‌ఫెక్షన్ అదీ కాకపోతే పైత్యకం. అవీ కారణాలు''.

ఆనంద నవ్వుమొహంతో అన్నాడు. ''సపోజ్ యిదీ వాటిలో జమ అయితే''

వెంటనే అన్నాడు వృద్ధు ''నెత్తిన గుడ్డేసుకుపోతాం గురూ''.

''గుడ్. లోపలికి రండిద్దరూ. అవుగో గాబులో నీళ్ల పక్కనే చిన్న కుండ. చేతులూ పాదాలు, మొహం కడుక్కు రండి. తాడు మీద తువాలా వున్నది'' ఆనంద లేచాడు.

4

ట్రీట్‌మెంట్ అప్లై చేసే గదే ఆకర్షవంతంగా చల్లగా వున్నది. మితంగా మీద

చల్లదనమున్నది. పాలరాళ్లు, గోడలూ బావున్నాయి రకరకాల పాలరాళ్లతో.

ఒక స్త్రీ బొమ్మ మనిషేనని భ్రమ కల్పిస్తూ రెండు కంచుబిళ్లలు చెరో చేతిలో వున్నాయి. మేకప్ ఆహార్యము చూడటానికే ముచ్చట గొలుపుతున్నాయి. ఆ బొమ్మ పక్కనే ఛాయా చిత్రం తీసే యంత్రం లాగా ఒక యంత్రమున్నది. పైన నల్లని గుడ్డ కప్పి వున్నది ఎదురుగా మెత్తలున్న కుర్చీ. దానిలో యువతి కూర్చున్నది నవ్వు మొహం.

''మీరా గదిలో విశ్రాంతి పొందండి. బాగా అలిసి వున్నారు. ఇష్టముంటే పత్రికలు చదువుకోవచ్చు'' అని తండ్రిని పిలుచుకెళ్లి పక్క గదిలో ఆహ్వానిస్తున్న బెడ్ చూపించాడు ఆనంద. ఆ గదీ చల్లగా వున్నది. తలుపులు దగ్గరసా వేసి వచ్చాడు. యువతి నవ్వు మొహం చూచి ఆనందించాడు. యంత్రం జరిపి యువతి మొహాని కానించి గుడ్డ తీసేశాడు.

బయట చీకట్లు కమ్ముకున్నాయి. గదిలోనూ చీకటి ఆవరించింది. లైటు తీసేశాడు ఆనంద.

''దానిలోంచి చూడాలి. చిత్రం నవ్వు తెప్పిస్తుంది. ఆపుకోగలరేమో చూడాలి నేను. ఈ కుర్చీలో గోడ దగ్గరగా వుంటాను. ఆ గదిలో మీ తండ్రి గారున్నారు. ఈ గదిలో అంతేవాసులున్నారు స్త్రీలే'' అన్నాడు.

పక్కనున్న బొమ్మ ఆడసాగింది. కంచుబిళ్లలు తాకిస్తున్న చప్పుడు. అది తాళం. పాట వినబడుతున్నది.

''కాశీపట్నం చూడవె తల్లీ! గంగానదినీ చూడవే బిడ్డా'' యువతి చూస్తుంటే కాశీనగరం డాక్యుమెంటరీ. గంగానది పుట్టుక దగ్గర్నించీ బంగాళాఖాతంలో కలిసేవరకూ, లైఫ్ బెల్టులో కాసేపూ, మరనావలో కాసేపూ, పడుతూ లేస్తూ, మునుగుతూ తేలుతూ, సుడిగుండంలో పడుతూ, పల్లానికి పడుతూ మళ్లా లేచి నదిలో తేలుతూ గంగ మీద పరిశోధన చేస్తూ ముగ్గురు యువక యోధుల సాహసయాత్ర. తర్వాత శివసముద్ర జలపాతం, చిలకసరస్సు. వలస వచ్చిన పక్షులు. నయాగరా, నదిలో నావ చూస్తుండగానే, చిన్న వేదిక

ఒకగుర్తింపు పొందిన మహిళ. విలేఖరులు యిద్దరు. చిన్ని తెరపై చిద్విలాసం చూపే చతురులిద్దరు. వారి చేతిలో వీడియోఫిల్ము తీసే యంత్రాలు. శుభోదయం చెప్పారు యువకులు.

మహిళ చెయ్యి జూపింది ''డ్రాఫ్టు తెచ్చారా? కాసుల మూటా?'' అన్నది చేయి శోభాహీనంగా వున్నా బలంగా యాక్టివ్‌గా కనబడింది. ఆ మహిళ పూర్వసువాసిని, ఆ ముసుగు, తెల్ల ధోవతీతోనే గుర్తింపు పొందింది. పాదాలకు చెప్పులన్నా లేవు.

''తెచ్చాము మేడమ్. ఒప్పందం చివరికిస్తామనే చేసుకున్నాం''

''నేనొప్పుకున్న టైం తక్కువ. త్వరగా కానీయండి ఇంటర్వ్యూ. నాకు మరో ఎంగేజ్‌మెంటున్నది'' అని లాయర్లాగా చూసింది.

''స్థిరంగా నిలబడలేదేమో కదుల్తున్నది'' అనుకున్నారు ఫిల్మ్ తీసే కళాకారులు.

''డబ్బు గుంజటంలో సిద్ధహస్తులనీ, నేర్పరులనీ, సామదానబేధ దండోపాయాలు అప్లై చేసి మొత్తం మీదే దృష్టిసారించి లాగేయగలరనీ లోకులు పలుగాకులై కూశారా? లేక నిజమేనా? నిజమేనని గర్వంగా ఒప్పుకునేట్లయితే, యెలా ఆ నాలుగూ అప్లై చేసేవారో సోదాహరణపూర్వకంగా చెప్పాలి'' అన్నాడు విలేఖరి. అలా అడగటానికి గుండెలుండాలి.

'' ఏమని పేరొస్తేనేమిటి. కూస్తే కూస్తాయి కాకులు. అది వాటి నైజం. పేరే పొందాననేదే ముఖ్యం. బలికి, దానకుతుక సాంద్రుడనీ, వదాన్యుడనీ పేర్లు. యేమి లాభించింది? కాని హిరణ్యకశిపునికీ, హిట్లర్‌కీ పేరొచ్చి గుర్తింపు రావటమేగాక ప్రపంచాన్ని గడగడలాడించారా యిద్దరూ. తమాషాగా వారి పేర్ల మొదటి హల్లులు ఒకటే. తినటానికి పిండం లేదని మొదలు పెట్టి, నెలకు పదిరూపాయల పింఛనీ యివ్వు అని, స్లోగా రేటు పెంచి, పనిమీద వచ్చినట్లు, సాయపడటానికి వచ్చినట్లు డ్రామా వేసి, వెళ్లేప్పుడు రైలు ఛార్జీలు, దోవలో తినటానికీ తాగటానికీ అని పేర్లు చెప్పి గుంజి పుడాయించేదాన్ని. అబురిడీ

ఫెయిలయితే, లేదా మరోసారి వెళ్లినప్పుడు, రాల్చక లొంగిరాకపోతే పెటకం పెట్టి, ఛిద్రం లేవదీసి, పొగరాజేస్తే, ధడుచుకుని రాల్చగానే పరుగెత్తేదాన్ని. గోలవినలేకే ముష్టి వేసి పంపేస్తాం''.

''డెత్ బెడ్ మీదున్నదని వార్త వస్తే వెళ్లి, కోలుకోని కూతుర్ని నిశ్చింతగా నిర్భీతిగా వదిలేసి రాత్రికి రాత్రి రైలందుకోటానికి క్కారణం వూడిపడలేదనేనా మేడం?'' విలేఖరి అడిగాడు. ''యస్ అర్ నో వెరీ సింపుల్. రెక్కలు కట్టుకు వాలి కూతురికి వైద్యమూ సేవా చేయాలని అంతేననుకుంటే, మోసం యిట్టే తెలిసిపోయి తప్పించుకుపోయినా'' కళ్లలో తీవ్రత మహిళకు.

''అట్టి క్రైసిస్‌లోనూ మోసం చేస్తారా? యెలా గ్రహించారు?''

''అల్లుని వేపు వారు యింటినిండా పోగైనారు గానీ, కిచెన్‌వేపూ వెళ్లరు. చిన్నబిడ్డలనూ గమనించరు. నీ కూతురి కోసం నువే చేయాలన్నట్టు మాట్లాడంగానే కుత్సితం వెల్లడైంది. వంచకుడైన సనిన్లా సీరియస్ అని వైరిచ్చి పిలిపించి వీరందరికీ వంటలక్కలాగా పెట్టాలని పథకం వేశాడని, వాడి గుట్టూ, యింట్లో పోగుబడిన వారి గుట్టూ బైటబెడుతూ, రై రైమని అరుస్తూ సరీగ్గా రైలు టైమని ''రాత్రి యేడున్నరకి పాసింజరున్నది'' నన్ను రైల్లో పారేయమని తారాస్థాయిలో చెప్పాను. మగవాడికి హైపిచ్డ్ వాయిస్సే త్వరగా వినబడుతుంది. యింట్లో వున్న గుంపూ తమ గొంతు వాల్యూమ్ హెచ్చించి చేతులాడించటం చూసి ముదురుపాకాన బడిందని, సమయస్ఫూర్తిగల అల్లుడు రైలు ఛార్జీలు, దోవలో మింగుడికి, కొంపకు చేరేందుకు బేటాగా చేతబెట్టి బండి పిలిపించి అందులో కూలేశాడు'' అని జేవురించిన మొహం, ముక్కు నలుపుకుని గూడెగరేసి ముసుగు జారుతుంటే దిద్దుకున్నది మహిళ.

''బిడ్డ లా మేరేజ్ వెలిగొస్తుందని గ్రహించగానే వారి గాంధర్వం ఆపేయక లా బర్డ్స్‌కి స్వేచ్ఛనిచ్చి, కథ అడ్డం తిరిగితే చేత చిక్కిన బిడ్డను వీధిలోకి నెట్టారని కోడై కూసింది లోకం. ''అందులో వింతేమున్నదీ. కోడికి కూయటం అలవాటు. యే మారేజీ జరగదనేది జగద్విదితం. సో పైకి కనబడేట్లు యేదో జరగలేదనీ

కూతురుదే తప్పని చూపాలి గనక నాటకం. డబ్బు చేత బెట్టి వెళ్లాలని తెలియదా? బుజ్జియా, డబ్బే అందరినీ లొంగదీసేది. అందులో నన్ను మరీనూ'' అని నవ్వు వచ్చినట్లు మొహం పెట్టింది మహిళ. యే రకం మారేజైనా డేంజరేనని యెగ్గొట్టాడు వంచకుడు టెర్రరిస్టుని కౌంటర్ టెర్రరిజంతో గెలవాలని, వైరాలు మాని, నా వాళ్ళందరినీ రెచ్చగొట్టి కూడ గట్టుకుని యాగీ చేశాను''. మహిళ అభినయం పిందులు తొక్కటం, చేతులాడించటం గొట్టంలోంచి చిత్రం చూస్తున్న యువతికి నవ్వు వచ్చింది. నవ్వు మొహమైంది. చిత్రం మరికొంత నడిచేప్పటికి యువతి గుళ్ళిగరేస్తూ మెల్లిగా నవ్వుతున్నది.

ఆనంద యువతిని చూస్తూనే వున్నాడు. గెలుపు కనబడి సంతోషం కలిగింది. డ్రాఫ్ట్ ష్యూర్.

''క్షమించాలి మేడమ్. మరొకబిడ్డ వికలురాలు కావటానికి మీరే కారణమని, తడిగుడ్డతో గొంతు కొయ్యటంలో స్పెషలైజ్ చేశారనీ కోళ్లుకూస్తుంటే పలుగాకులు విని తామూ కూసినై'' అంటున్నాడు విలేఖరి.

''వైకల్యమనేది హెరిడిటరీ. కోళ్లూ కాకులూ కూస్తే వెరిచే రకం కాదు నేను. ధనమూలం మిదం జగత్. అండ్ ఫర్ దట్ మాటర్ కూసే కోళ్లకీ, పలుగాకుకీ గూడా డబ్బే పావనం'' అని నిర్లక్ష్యంగా చూసింది మహిళ.

''వైకల్యం వల్ల వికలురు పూరికేనే రేగిపోతారు గదా మేడమ్. మీరు కావాలని రెచ్చగొట్టే వారంటారు. యెందుకని? మళ్లా చూస్తే మీరు బాగా చదువుకున్నవారు. ప్రపంచం తీరుతెన్నులు చూసినవారూ మరియూ వేత్త గూడాను''. ఒక్కోసారి మాటలతో ఫైటింగ్ చేతులు కలిసి, చిన్న సైజు స్ట్రీట్ ఫైటింగ్ లాగా రంజింప జేసేదిట చూచేవారికి''.

మహిళకి నవ్వూ గర్వమూ కలిసి వచ్చాయి.

''మీకు తెలియదేమో! వైకల్యమనేది డబ్బు తగాదాతోనే వస్తుంది. అర్ధరాజ్యమన్నా అడగక మొత్తం లాగేసిందే కైకా అని రామునకివ్వాలని ఆశపించుకున్న దశరథుడు, రామునకిచ్చేందుకేమీ లేనివాడై పెన్నీలెస్ అయి,

బిడ్డను అడవులకి గూడా పంపాల్సి వచ్చిందని వికలుడైనాడు. డబ్బు విషయంలోనే కైకా దశరథుడు తగాదా పడ్డారు. మా వాళ్లలో భార్యాభర్తలు డబ్బు విషయంలో తగాదా పడితే భార్య బావిలో పడటమో, భర్త వికలుడై దేశదిమ్మరికావటమో జరిగింది. డబ్బే కిటుకూ, కీలకం, అంతా లాగేస్తావేమని బిడ్డా, నేనే నీ మీద ఇన్‌వెస్ట్ చేసి నీ ఆస్తి గెలిచి పెట్టాను. నీ బావగారు కోర్టు పక్షి దగుల్బాజీని ఓడించాను. నువ్వు నాకు ముష్టి వేస్తావా? నేనే నీకు వేస్తాను'' అని రెచ్చిపోయే వాళ్లం అని అభినయంతో సహా చెప్తూ సిగ్గులేని నవ్వు నవ్వుతుంటే విలేఖరి ''మేడమ్! మీరు పుణ్యం సంపాయించాలని కాశీయాత్రగూడా చేశారని వినికిడి. కాశీలో ప్రియమైనవి వదిలేయాలి. యేమి వదిలేశారు'' అనడిగారు.

''సిగ్గు, లజ్జా, బిడియం'' వదిలేశానంటూ బాగా నవ్వింది.

లంచ్‌వేళ అవుతున్నది. యువతి విరగబడి నవ్వుతూ కదిలిపోవటం చూసిన ఆనంద లేచి వచ్చాడు. తలుపులు తీసుకుని వృద్ధుడూ వచ్చాడు.

యువతి నవ్వుతూ నిలబడి, ''నా ఐవేజు కోసమే ముష్టియుద్ధం వాగ్యుద్ధం కలేబడటం జరిగేది గురూ. ఆ చిత్రంలోని లీడింగ్ మహిళ మూడుమూర్తులా మా అమ్మే. ఆ డూప్ అతి సహజంగా నటించింది. అది నటనల్లేనే లేదు. అది నటి అనుకోలేదు నేను. మా అమ్మే డబ్బు కోసం అలా నటిస్తున్నదనుకున్నా ద్వంద యుద్ధంలో మాతృదేవత నా కేశరాశి పట్టుకుని వంగదీయాలని చూస్తేనే నామె గుండు మీది ముసుగు లాగేసేదాన్ని. నక్కలాంటి నిజరూపం బయటపడేది. అవన్నీ పైకరుస్తానేమోనని బిగుసుకుపోతే యీ తాత దేవుడది జబ్బనుకుని డ్యాక్టర్లకి చూపాడు గురూ'' అని నవ్వే యువతిని వృద్ధుడు ఆపేక్షగా పట్టుకున్నాడు.

''యెన్నాళ్లైంది నా మనమరాలు నవ్వుమొహం చూసి దయ్యపు చూపుపోయింది. గుడ్లు నిలేసి చూడటం పోయింది గురూ. మొద్దు నక్కలాగా లేదిప్పుడు మొహం. తెలివిగా తెల్లగా వున్నది. దత్తు చేసుకుని నా ఆస్తీ దీని పేర పెట్టాను గురూ. దానికీ దత్తు చేశాను. చదువుతున్నాడు బిడ్డ. మీ థెరపీ త్వరగా

పనిచేసింది గురూ'' అని సంతోషంగా సంచీ వూడదీసి నాల్గువేల డ్రాఫ్టు అందించాడు సదానందకి. ఇద్దరూ దణ్ణం పెట్టి వెళ్లిపోయారు. సదానంద ఆసక్తి లేకుండా డ్రాఫ్టు వంక చూశాడు.